# తెలుగుతెన్నెలు

పండు వేసంగి—

పట్టపవలే తాతగారు ఘుమఘుమలాడుతున్నారు, ఏమా విశేషం—అనుకున్నాను:

ఒరే నవమదనా—ఏం చేస్తున్నావురా ? అన్నారు. గదిగుమ్మంలోకి వచ్చి—

చేత నున్న పుస్తకం దాచేయబోయినాను. కాదూ, వారికి చిరునవ్వు వచ్చింది : వచ్చి నర సను కూర్చుని, మునివేళ్లతో చెంపలు పుణికి—భార్య పురుడోసుకునేందుకు పుట్టిన యింటికి పోంగానే, పుస్తకం చేపట్టావా, నాన్నా ! —పరాసుదేశం బోసిబొమ్మలు — కాగితపు దళసరీ, తళుకే కాని, కాలక్షేపానికి పనికివస్తాయా—!

ఒరేయ్ మన దేశం రత్నగర్భరా !— రా పోదాం !

'ఎందాకా ?'

అందాకా !—నేరని విద్దెలు నేర్చుకునే వయసు తీరని కోరికలు తీర్చుకునే వయసు—ఒంటరి పానుపుమీద అసురుసురంటూ, కాగితబ్బొమ్మల కాళ్లా వేళ్లా పడితే—కలిసొచ్చేనా ?—

పలుకరిస్తే—పలికే చిలకలుండగా, పావుతావు కాగితంతో ప్రణయా లేమిటిరా ?—

తాతయ్యా ! యివి బూతుబొమ్మలు కావు! మహాశిల్పుల కళాఖండాలు :—

అయితే అలా బైండు పుస్తకంలో పడి ఉండనీ : కళ అనేది—కంటికి కట్టాలి—తక్షణం—వంటికి పట్టాలి : అంగలార్చితే వచ్చేది కాదురా ఆనందం—అంకెకు దార్చి అనుభవంలో అందు బాటు చేసుకోవాలి !—మనం పడుచువాళ్లంరా భడవా !—ప్రత్యక్షం మనకు ప్రమాణం—కావలసి వన్ని కళాఖండాలు, కనుచూపుమేరలో కలవురా—యిహ కదులు :

కదలక తప్పింది కాదు!

ఎక్కడికని అడిగేందుకు ధైర్యంలేదు

నీరెండ పొడ ఉండగా, ఆ చెరువుగట్టున బండీ దిగినాము. మామిడితోపు అద్దరిని వూరు, చూచాయగా కనపడుతూంది:

బండీ కట్టుకొచ్చిన పెద్ద పాలేరు, వూర్లోకి వెళ్లాడు: తాతగారు తీరుబడిగా స్నానం చేసి అను ష్ఠానం తీర్చుకుని, మడి మాని, యథోచితమ్మైన శీవితో, మెట్లమీద కూర్చున్నారు:

దీన్ని కామావధాన్లగారి కోనేరంటారు : తెలుసునా.

ఉహుఁ—

వారు, మా ముత్తాతగారన్న సంగతి తెలుసునా—నీవు, చెప్పగా విన్నాను:

పేరు చెప్పాను కాని, ప్రతాపం చెప్పలేదురా—చెప్పనా—నీవు యీ యీడున ముఖ్యంగా తెలుసుకోవలసిన హంశం!

ఆయన నవద్వీపంలో, చదువుకున్నాడు—మిథిలలో మెరుగులు దిద్దుకున్నాడు—వారణాసిలో చండప్రచండులచేత చిరంజీవన్న అనిపించు కున్నాడు. అయిదు సంవత్సరాల పాటు, కాశీ నరే శుల పండిత మండలికి మకుటాయమానులై ఉన్నారు

అంతట స్వదేశానికి వచ్చారు.

వచ్చిన కొత్తలో,—

దేశంలో, మహారాజుల దివాణంలో, సంక్రాంతి పండుగలు, వేసీవేయని వేడుకలు—

ఆనాడు కూడ, పండితసదస్సు, వేయికి పైగా దుశ్శాలువలు కోటగుమ్మం తొక్కినవి.

ఈ కామన్నకు పట్టుమని బ్రహ్మవర్చస్సై తే ఉన్నది కాని, పైన సేలువ లేదు—కనుబొమ్మల గర్వంలేదు. దండలు తిరిగి ఉన్నవి కాని, దర్పం లేదు—తనంతవాడు లేడన్న తలవిసురు లేదు. గుమ్మంవద్దనే ఆపేశారు. జంఝెుప్పాచ చూసి, దొడ్డిసంభావనకు పొమ్మన్నారు.

పొమ్మన్నవాడి వంక, కామన్న అహాఁ !—అన్నట్టు చూశాడు. అవతలివాడు జబ్బ పట్టుకున్నాడు: పట్టుకున్నాడో — పదిబారల దూరాన పోయి పడ్డాడు—

ఏం రభస అయేదో కాని, యింతలో అచ్చన్న దీక్షితులుగారు అక్కడికి రావడం జరిగింది. ఈ అచ్చన్నగారి దగ్గిర చిన్నప్పుడు కామన్న రామ శబ్దం ప్రారంభించి, సాగక మానేశాడు—మాన డానికి కారణం ఏమో తెలుసునా—

యీ కాకికూతలు నే కూయలేను—కావ్యపాఠం మొదలుపెట్టండి అన్నాడుట.

నోరుమూయరా—అన్నారుట వారు.

నోరు మూసుకుంటే చదువొస్తుందా, ముక్కు మూసుకుంటేక మోక్షం వస్తుందా,—అన్నాట్ట యితగాడు: అంత కోపధారీ అప్పై వచ్చి—ఒరే కాముడూ, దైవం రక్షించాలి గాని, నీవు తార్కి కుడ వయ్యేవురా ! నీ వైనంలో ఆ రుజుడితి ఉందిరా, కనుపాపల్లో గంభీరిమ కద్దురా — నీకు చదువు చెప్పగల సత్తా నాకు లేదురా—పోఁ—దేశం మీదికి పో—దేశాలన్నీ జయించుకురా — అని—వెన్నుచరచి వారట కామన్న కదిలాడు:

ఆపైన భారతమంత గ్రంథం ఉంది: అది మరోమారు:

అదిగో, ఆ అచ్చన్నగారూ, వీరూ, అన్నేళ్లకు అక్కడ తారసిల్లారు: ఆ దుడుకుతనం చూసీ చూడంగనే పోల్చుకున్నారు. కావఁన్నా అని కౌగ లించుకున్నారు: బుగ్గలు నులుముతూ:—

ఏమిరా, యింతకాలం ఎక్కడున్నట్టు ?

దేశం మీద—

ఏం నేర్చినావురా–? యీ విద్యేనా–? అక్షరం ముక్క ఏమన్నా అబ్బిందా ?—

అబ్బింది—జబ్బపుష్టి !—

అరి వి(భ్రా)సీ, పరువుగా, నోరు పెట్టుకుని బ్రతుకుతా వనుకుంటినిరా!—పైన సేలువతోకంట పడతా వనుకుంటినిరా !— ఆయెూహో !—ఏమైనా మెట్టుకు, నా శిష్యుడివే—దా, సభకు పోదాం—

సభలో సంతర్పణ మాకు కాదు—మాది దొడ్డి సంభావన !—

అని ఎవరన్నారు ?—

ఆ జులపాలరాయుడు—

అన్నాడో — పడ్డాడో — రాయుడూ, మన సులో చెంపలు వేసుకుని, మావాని పాదాభివందనం చెయ్యి —.

సభలో,—

కామన్న గురువుగారికి వెనుకగా నిలుచున్నాడు.—వారిది — అగ్రాసనం—

మహారాజా విచ్చేసి, సభకు మ్రొక్కి ఆసీనులు కాంగా,—ఆ సంజెప్రొద్దుకు,—

ఒక బక్కపలచని పడుచువాడు, తురక శీవి వాడు, చిగురుమీసంవాడు, తులసిమాల మెడ దాల్చినవాడు, లేచి నిలుచుని, తన బిరుదుల ఏక రువు పెట్టి, గురువుల పేరెత్తి, దీక్షైన పండి తులను, తనతో మాట కలుపమని, తన్నోడించ గలవా రున్నారా అని గద్దరించి, సభాపతికి హెచ్చ రింపుగా చేజాపి, అంగుళితో ప్రశ్నించినాడు—

అచ్చన్నగారు, వాని ఆగడము చూసి, కామన్న వంక జూసి, వీ డెవడో రాలుగాయిరా, అనంగా,

ఆకాయను యిట్టే రాల్చేను. అనుజ్ఞ నీయండి—

అభాసు చేయవుగద—

సభ మరింతగా, భాసించేను—చిత్తగించండి !—అనగా—అచ్చన్నగారు తల యూచి ముగుదల ఊయగా,

కామన్న, ముందుకు వచ్చి, పండితులకు మ్రొక్కి—గీర్వాణంగా—

ఈ ఆయుష్మంతుడు—వరుస తప్పిన వార యోషిన్మృదంగము!

విద్దెలకు పరువుగా వినయమునేర్చిన పెద్దల

మల్లాది రామకృష్ణ శాస్త్రి

ప్రోల ధిక్కాం అని ప్రోగినది: ప్రభువు అవధరించినారుగద !—(మహారాజు మోముచౌమముడి ఖ్యైనది)

వేలు ! ....

ఈ విద్వాంసునితో, తలపడగల సరసత, సభలో ఛాందసులకు — లేదు—వీరందరూ మడి గట్టుకొన్నవారు — వేదచోదితమ్మైన దుడుసుతనం కలదేమో కాని, తారతమ్య మారయక నోరు పారవేసుకొనుట వీరి తరముకాదు. ఈ—వీరి విద్యతో పస యెట్టిదో నిగ్గుదేల్చగలవారిని ప్రభువులు రప్పించవలె—

వా రెవరనేరా—'కౌగిట నెనుబది నాలుగు విధముల గరడీలు గరపు' అలనాటి ప్రౌఢనాయకి, సహస్రసమాసజీవి, గుడిసేవ సభారంజని— కామాగమాధ్యయన పాటవమున వీ రెంతటి గడితేరినవారో, ఆమె తమ సముఖమున తలస్పర్శిగా పరీక్షించును గాక: అలదానిచే భళా యనిపించుకొనేనో, మన పండితులు సేలువలతో వీనికి పానుపమరించేరు. కామశాస్త్రము గోష్ఠికి రాదగిన విద్య యని ఆదిశంకరు లంగీకరించినదే—యింక ఆలస్య మెందులకు—ప్రభూ!

అందులకు దీక్షైన సభాపతులు—దేవరవారే—

అచ్చన్న దీక్షితులవారు, వాకోవాక్యమున మేలుబంతి కాని, యిందుల, యీ వయసున, కోవిదులు కారు! దక్షత కల తావూ విద్దెల, కయ్యము, వినోదముగ, అవధరించి, కృతకృత్యు లైనవారికి, మెచ్చి, ఉపద లిచ్చేరో ఉలుపా లిచ్చేరో, ....

అన్నాడయ్యా!

ఆసళంగా, పండితు లందరూ, పట్టలేక సేలువలు సవరించుకుంటూ చిరునవ్వులు నవ్వుకున్నారు.

ఇహ, సభా లేదు, శాస్త్రార్థమూ లేదు!

కామన్న తెలిసి అన్నాడో, తెలియక అన్నాడో కాని, మహారాజావారు బుజాలు తడుముకున్నారు.

వైనం ఏమంటే .... వారికీ నీలాగే కళాభిలాష, ఆ అభిరుచి, ఉడ్డోలం.

మనం ఏదో తగుమాత్రం సంపన్నులం గనుక బోలెడంత విలువ పెట్టి, బొమ్మలున్న గ్రంథాలు కొనుక్కొంటాము. వారు వేసీవేయని సిరులున్నవారాయెను, తమకము అగ్గలమయే తరుణాన సజీవప్రతిమలతో రాసవినోదములు ఏర్పాటు చేయించడం, పదములౌత్తువారి సరసను ఏకాంత గోష్ఠిలో ఆనందించడం కద్దు: అది తరతరాలుగా వస్తూ ఉన్నదే: అది మన సీమలో పండిత పామరులు యావన్మందికీ హృత్కావిలె—

మహారాజావారు, ఏమాట కామాట—రాచపుట్టువు కదూ, మనుసు రగులుతున్నా, పైకి శాంతంగానే చేయెత్తి అప్పటికి సభ చాలించి ఏకాంత మందిరానికి దయచేశారు!

సభలోవారు సభలో మిగిలారు!

అచ్చన్నగారు ముక్కుమీద వేలువేసుకుని, హన్నా ! ఎంతపని జేస్తివిరా ! అన్నారు!

ఆ గౌడబ్రాహ్మణుడు, యినుమిక్కిలి తల విసురుగా యిచ్చటివారి పాండిత్య మింతింతయేనా,



అన్నాడు—అనడం తడవుగా కామన్న చరచర వాని మీదికి పోయి, భుజములమీద చేతులు వేసి వాని చెవిలో గుసగుస లాడినాడు—వాడు అమాంతం కామన్నకు సాష్టాంగపడినాడు!

ఏల ?—

కామన్నను అప్పటికి, వాడు గురుతించాడు.

ఇంతకూ వా డెవరని—నవద్వీపంలో కామన్నతో కలసి చదువుకున్నవాని శిష్యుడు! కామన్న వార ణాసిలో ధర్మాధికారిగా ఉంటూన్నపుడు మహారాజ దర్శనం చేసి, విద్య చూపి అచ్చటి పెద్దలను మెప్పించి, సమ్మానము లందినవాడు! వాని బిరుదా వళిలో కొన్ని, కామన్న కటాక్షించినవే, వాని (వేలి రవల ఉంగరము కామన్న మెచ్చి యిచ్చినదే.

పైన సేలువా, పటాటోపమూ లేని యీ అవతారములో, అతగాడు కామన్నను పోల్చుకోలేక పోవడంతో, ఆ రవంత రభసా జరిగింది.

చిగురుకు సద్దు మణిగింది! అతడు, ఆ పండి తులు, తమ పరువు సలక్షణంగా దక్కిందని ఆనం దించారు! కామన్న కలుగజేసుకుని ఉంటే ఆ గౌడుడు ఆగేనా ? వాని కా తీరున వినయము గరపి, తానూ, తన సీమ పెద్దరికము నిలిపినాడు.

ఇంతలో, అచ్చన్నగారికి వర్తమానం వచ్చింది—ప్రభువులు, ఏకాంతమందిరంలో ఉన్నారు—తక్షణం దర్శనం యిప్పించమని శ్రీవారి సెల వైందీ, అని—

అచ్చన్నగారు—అడుగు ముందుకు వేశారు—కామన్న ఆపేశాడు—

ఆ వచ్చినవానితో—యిలా అన్నాడు—

మహారాజా పరువుకు పుట్ట లేదా—ధర్మము పట్టం కట్టలేదా ? తాను పరగణాకు ప్రభువు కాని, పండితుల పాదధూళి శిరస్సున దాల్చి వర్ధిల్ల వలసినవాడు కాదా ?—యింతకాలమూ సుఖ ముగా నున్నది— వీరి దీవెనల బలిమిని కాదా—చతుర్ముఖుడు కానీ, శారదాదేవి కానీ, పండితు లను విద్యాతపస్సంపన్నులను చులకన చేసిన, వారికి పూవూ పత్రీ పుట్టవే—మన రాజెంత ! బ్రాహ్మణ్యము కన్ను దెరచిన ఒక్క చిటికెలో త్రోసిరాజా కాడా !— పండితసభ విడిచిపోయి నాడే, — ఎవరి అనుమతి కోరినాడు?—పో—గురు వుల దర్శనభాగ్యమే అపేక్షించినవారైతే, వచ్చి పదములంటి ప్రసన్నుల జేసికొనమను !—అని తరిమివేసినాడు—అందరూ కలవరపడినారు, కాని ఎవ్వరూ కామన్న కెదురాడరైరి.

పండితు లందరితో కలసి కదలిపోయి—వేణు గోపాలస్వామి ఆలయంలో యిష్టాగోష్టిలో ఉండగా—పక్కా ఝాముకు, పెద్దలంటే భయ భక్తులున్న ఓ ఉద్యోగి నురుగులు గ్రక్కుతూ, అక్కడకు వచ్చిపడ్డాడు! సభలో కామన్న అన్న మాటలు చిలవలు పలవలుగా మహారాజుల చెవిని పడ్డవి—వారు కణకణలాడుతున్నారు. ఆ బ్రాహ్మ ణుడి సిగపాయ దెచ్చినవారికి పది సంచుల వరా లిస్తా మన్నారు! కాని, కోటలో బంటెవరూ ముందుకు రాలేదు: పాలెం వర్తమానం పంపారు, సాటిరాచ వారికి—గేడియకో, రెండు ఘళ్లకో వారు వచ్చి పడగలరు—యీతణ్ణి బ్రతకనీయరు—ఇక బ్రాహ్మ ణీకానికి ఉప్పూ, పత్రీ పుట్టదు...

వినివినడంతోనే ఉన్నవా రందరూ గగ్గో లైనారు. కామన్న చిరునవ్వుతో,-అలాగా-అన్నాడు.

వచ్చేవా రెందరు ?

జీకరో—యిద్దరో—

అంతేనా—మన కొక్కు వేలి క్రింద !

వారిచేత కత్తులుండేవయ్యా !—

రాచవారిచేత కత్తులు కాక, గరిటె లుంట వటయ్యా—రానీ—హుటాహుటి యిక్కడికే వచ్చేరు కద !—

ఊహూఁ—ఆలయములో అంతకు తెగించలేరు! బయట ఏ క్రీడనో నక్కి ఓ వ్రేటు వేసేరు!

మంచిది—నే నిక్కడ ఉన్నట్టు వారికి రూఢిగా తెలుసునా, వర్తమానం అంపవలెనా,

ఇక్కడికే వచ్చిపడతారయ్యా—

అయితే మా బాగేనయ్యా !—

అచ్చన్నగారు కామన్నను కౌగలించుకుని, నాయనా నిన్నెట్లా రక్షించుకొందునురా !—అని వాపోవ పోగా — కామన్న పెద్ద పెట్టున నవ్వి—గురువు గారు—మీ ఆశీస్సు నాచేతి వజ్రాయుధము — వచ్చి వడేవి — మీసములు పోతరించిన సొరకాయలు— నరకడం ఒక లెక్కా !—

మనము పరశురాముని కోవలో వారమే— కాని, రాచవారిని నిశ్శేషము చేయము.

మీకా భయము అక్కరలేదు—యీ ఒక్క తప్పూ కాచేము—

ఒకరు సైకిల్ మీదనుంచి పడిపోగా తీవ్రమైన గాయాలు తగిలాయి. బాధ పడు తున్నాడు.

ఆదారినపోయే పెద్దమనిషి ఆతని దగ్గరికి వెళ్లి "నువ్వు చాలా అదృష్టవంతుడివోయ్" అన్నాడు.

"ఎందుచేతనో సెలవిస్తా రా" అని కోపంగా అడిగాడు బాధలో ఉన్న మనిషి.

"ఏమీ లేదు. ఆ స్త్రీ ప్రక్కనే ఉందిలే."

బవిరిశెట్టి సుబ్బరాజు (నవశేశ్వరం)

గాయత్రి మనకు రక్ష—ఆ తల్లిమీద కత్తులు దూయగలవా డెవడండీ !—

అన్నాడు—

అంతలో పండితులందరూ ఒక్కుమ్మడి ఉవ్వె త్తున లేచి, నడుముకు అంగవస్త్రము చుట్టారు!

అచ్చన్న బాబూ—యిందరముండి యీ చిన్న వాడిమీద యాగ వాలనిచ్చేవా ?— యిద్దర కానీ, ఇన్నూరు కానీ, ఈ చాయలకు వచ్చారో, కలికంలోకైనా కనబడేరా ?—అన్నారు.

కామన్న వా రందరికీ మ్రొక్కి—తమకు తామసం జెల్లదు; యీ చిన్నవాడిమీద ఆ యీగలు వాలవు— చూచేరుగా—మీరు కలుగజేసుకోవలసిన గండకత్తెర కాదిది—అంటూ అనునయించినంతలో—

రావవారు, రానే వచ్చారు. చీకటిమాటున, దొంగచాటున, కాదు—రొమ్ము విరుచుకునే—దివ్వటీలుగా ....

అచ్చన్నగారిని పేరున పిలిచారు. వారు ముందుకు దయచేశారు...వెనువెంటనే ఉన్న కామన్నను నిర్దే శిస్తూ,—ఆ ఆతతాయి సిగ ఉత్తరించి తమకు అందజేయమన్నారు! లేదా, అని, హుంకరించి చేత పట్టినవి—ఝుళిపించారు! కామన్న మెరుపల్లే గాలి యీతగా, దూసుకునిపోయి, వారిచేత కత్తులు అంకించుకొని, కత్తి మొన మోపుగా పల్టీ కొట్టి ఎగిరి నిలుచుని, కత్తులు దూరంగా విసిరేసి,—ఆ జోడుమీదకు మిడిసిపడి, రెక్క లొడిసిపట్టి, గోట మీటినట్లు, వా రిద్దరిని అచ్చన్నగారి పద సన్నిధికి ఎగజిమ్మినాడు. రాచచోదులు, బెల్లపు అచ్చులవలె, పడినారు—కామన్న, వారి వెన్ను తట్టి లేవనెత్తి,—ఏలినవారి బుద్ధి క్షణికంగా చంచలించి వాయి పులుమేసింది పో, మీకు విచక్షణ అక్కర లేదా ?— అన్నదాతలు కనుసన్నగా ఆజ్ఞాపించినారని ఆగడము చూపవచ్చారా ?— అమాయకులారా— మీకు మీసలు ఎగదువ్వంగనే యీ మిడిమేలపు రోస మబ్బెనా, యీనాటినుండి, మీరు, మీ వంగసము వారు, మీసముపై చేయి వేయరాదు—యిదే మీకు శిక్ష, యిదే మీ ఐదువల కుంకుమకు కలకాలము రక్ష— అని మందలించి, మహారాజులు ఎచ్చట, ఏ తీరున ఉన్నదీ, వారివలన తెలుసుకుని ఆ తావుకు ఒక్క ఉరుకున పోయినాడు—

ఆ తావు ?—

ఉద్యానంలో, పూలపాన్పు, కలపమలందిన మేనితో కన్నుల మత్తుతో, శ్రీవారో మల్లెల మాలను ఒడిసి పట్టే సన్నాహంలో ఉన్నారు : ఆ చిన్నది నసే మిరా .... ఏలినవారూ, బ్రాహ్మణుడి సిగ ఉత్త రించమని సెలవిచ్చినారట— ఇంత పాపం ఏనాడూ మన సీమలో పుట్టలేదు—మీరు కులానికి మచ్చ దెచ్చారు— మీ పెద్దల బ్రాహ్మణభక్తిని, గంగ పాలు చేశారు! మీరు భ్రష్టులు,—నేను వెల యాలినే కాని, కులమున్నదానను—ఈ కన్నె, మీకు లోకువ గాదు !—

ప్రభువులు, బూతుకూతలకు దిగినారు—నిన్ను మా దండుకు ఎరగా వేస్తానన్నారు. దాని గొంతు పట్టుకుని, చీ పోవే అని విసిరేసి, తాము తూలుతూ పానుపుమీద పడినారు: అంతలో ఆ చాయకు వచ్చిన కామన్న, ఆ చిన్నది, పడిపో

కుండా సందిట పట్టి నిలిపి—మహారాజుల సరసకు జేరి, వారి ఎగు మీసం, క్రిందికి దువ్వి,—ప్రభూ! అని పలుకరించగా, వారు, రవుద్రంతో పిడికిలి బిగించి, కామన్న మొగానికి గురి చూడగా, అతడా చేతిని ఒడిసి పట్టి, ఎడమచేయి రొమ్ముమీద వేసి శాంతించవలె అనంగా, వారు, భటుల కోసం పొల్లు కేక పెట్టపోగా—ఆ చేయి వారి పెదవుల కదిమి, మీ గొంతు, మోటవానిచేత బడ్డ మొగలిరేక, నులుముట మా కలవోక—

కాని, మీరు కలకాలము, నీతివంతులై వర్ధిల్లుట మా అభిమతము. మా ఆశీస్సు—ప్రభూ!

మీ కరములు మా పాదము లంటి ఆయుర్భాగ్యమందవలెనే కాని, మాపై కాలుదువ్వ నగునా?—

బ్రాహ్మణుని సిగ—వేదశిఖ—దానిని మీ కులము వా రహరహ మారాధించవలె—మీరు శలభములు కారాదు—యిచ్చి పుచ్చుకొను నేర్పు మా కులమున కున్నది. మీకు ప్రాణదానము చేసినాము. మాకు మీరు వాగ్దానము చేయవలె.

మీ వంశము ధర్మరక్షణకు పేరు మ్రోగవలె. బ్రాహ్మణభక్తితో వాసి కెక్కవలె.

కామన్న కుడిచేయి జాపినాడు. ప్రభువులు తమ కరపల్లవము నందుంచి, 'యిదే మా పెద్దల మీద ఆన' అన్నారు బుద్ధిగా—

మీరు వస్తుతః బుద్ధిమంతులే, కాని, రాజసమై రావణుని, కుక్కుటపుతనము మిమ్ము కమ్మినది. పోనిండు. ఉభయుల గండము గడిచినది—

ఇంక మీ పెద్దరికము నిలుపుకొనవలె— యీ చిన్నదానిని మీ కోడలుగా చేసికొనండి.

కులము చాలదనుకొనేరా—ఆపన్నను రక్షించినప్పుడే అది నాకు కూతురైనది! యిందుకోసము, యీ బ్రహ్మచారి గృహస్థుయి కన్యాదానము చేసెను! అభ్యంతరమా?—అన్నాడు కామన్న.

తమ ఆజ్ఞ అయినది కదా! అన్నారు శ్రీవారు.

అప్పుడు—కామన్న ఒక యింటివాడైనాడు. కన్య ఎవరు—ఆ గౌడ పండితుడి సోదరి—అచ్చన్న దీక్షితులుగారు కన్యాదానం చేసినారు—

ఒరే నాన్నా—మన యింటికి తెలుగుపిల్ల కోడలుగా రావడం, నా హయాంలోనే ఆరంభం—మా తల్లి మహారాష్ట్ర దేశపు ఆడుపడుచు, మా ముత్తవ—ఒక కాశ్మీరకుసుమం—సరే కామన్నగారి యిల్లాలు: నాయనా, ఆనవాయతి తప్పకుండ నీ బిడ్డలకైన దేశంమీద సంబంధాలు చేయరా—

అది మునుముందు చూసుకుందాం, మళ్లీ కథలోకి వద్దాం—ఆ కామన్నగారు, ఆ చిన్నదానిని, తానన్న మాటమేరకు, సాలంకృత కన్యాదానం చేశారు; ఎవరికి,—ఏలినవారి, రెండో కుర్రవాడికి—వేణుగోపాలుడి ఆలయంలో వివాహం జరిగింది:

ఆ కుర్రవాడు, భార్యతో కోటలో ఉండలేదు: ఈ గ్రామంలో సౌధం నిర్మించుకుని కాపురం చేశారు: కామన్నగారు— యీ గ్రామంలో గోపాల ఆలయం నిర్మింపజేశారు! వారు చుట్టపు చూపుగా వచ్చినపుడు, స్నానాదికములకుగాను,—యీ తటాకనిర్మాణం జరిగింది.

మనం యింతదూరము వచ్చిం దెందుకు—ఆ స్వామి దర్శనానికి. ఆ లోగిలిలో నిత్యకళ్యాణిగా నివసిస్తూన్న—వృద్ధావారి దర్శనానికి—




శీఘ్రంగా పనిచేసే అమృతాంజన్ లిమిటెడ్ వారి గ్రైప్ మిక్శ్చర్ చంటిపిల్లల ఉదర విపర్యాసాలను సరిచేస్తుంది. వాళ్లను ఆరోగ్యంగాను, సంతోషంగాను ఉంచుతుంది.

ప్రతి ప్యాక్‌తోను ఒక చమచా ఉచితము

అమృతాంజన్ లిమిటెడ్

14/18, ఎతిరాజ్ రోడ్డు, మద్రాసు-4. ఇంకా బొంబాయి-1, కలకత్తా-1 & న్యూ ఢిల్లీ

JWT-AMG 876



బుడుగు రూ. 1-25

టామ్‌సాయర్ ,, 2-00

పోస్టేజి, ప్యాకింగ్ ఖర్చులు ప్రత్యేకము

ఆంధ్రగ్రంథమాల,

7, తంబుచెట్టి వీధి, మద్రాసు-1

ఇక బయులుదేరాము: ఆ గుమ్మము సమీపించ గానే,—యిద్దరు బాలలు పూర్ణకుంభములతో ఎదురైనారు: అడుగు ముందుకు వేయుగా, మరో సుందరి ఆరతి పట్టినది: యింకను ముందుకు పోగా,—ఆ అవ్వ,—కైమోడ్పుతో, ఎదురై,—తాత గారి పదము లంటి, కైదండ యిచ్చి, లోనికి సాగినది:

ఆసీనులమైనాము: వీణలు మీటుతూన్న జవ్వనులు, వాదన మాపి చేయెత్తి మ్రొక్కినారు.

కృష్ణా! వీడు, మా మనుమడమ్మా!—

అలాగే!—పొత్తిళ్లలో ఉండగా వీరి దర్శనము చేసుకున్నాను: ఆనాటి కీనాడు, స్వామి దర్శనానికి తాతగారి వెంట దయచేశారా, నాయనా—

మన వేణుగోపాలుడు కడు చక్కని స్వామి కదయ్యా—మనసులు తన కైవసము చేసిన కన్నెలకు, వయారమూ ఒద్దికలూ, లేతదనం, నీతి దనం—కలకాలమూ నిలిచే వరాలుగా వారు యిచ్చేరయ్యా, వారి వేణురవళి, మాకు గానం నేర్పేను. వారి మువ్వల సవ్వడి నాట్యం నేర్పేను. వారి చిరునవ్వు మాకు బాసికము, వారి కొంటెచూపులు మాకు మంగళసూత్రము—ఆ వెన్నెల చిందులయ్యా, మేము—మా కన్నులకు అలవాడు పండువేనయ్యా—అని,

అయ్యగారూ, స్వామి దర్శనానికి, తరలి పోయేమా, తాము ముందు నడవేరా, అని మనవి చేసి,—నాయనా, ఒక్క క్షణములో ఆయత్తమయేమయ్యా—అని, లోనికి పోయినది—

ఆ కన్నెలందరూ, తాతగారికి చేరువగా వచ్చి నిలచారు. తాతగారు ఓ చిన్నదానితో,

ఏమే నవమల్లికా—మా మనుమడు చక్కనివాడందమా, అనగా—ఆ వయారి,

మోమందము—కేమి గాని, కన్నులలో రసికత వన్నెలు తేరలేదే—అన్నది.

# వెలది వెన్నెల

మరో పడుచు—ఓరచూపీసుకుమారుడు నేర్వలేదో—అనంగా,

మరో ప్రౌఢ—చిరునవ్వు లెన్ని తీరులో, మీ చిన్నవాడు వల్లెవేసెనో,—అని కనులార ప్రశ్న సేయుగా

మరో నేర్పరి—కనుసైగలతో పలుకరించు అలవాటు,—మౌనముగా పలుకాడు నేర్పు వీరికి వెన్నతో పెట్టలేదో—అని మోవిని లాస్య మాడించగా,

యిలా, యిలా ఆ బాలలు నామీద పూవుల బాణాలు వేశారు!

తాతగారు—అమాయికంగా, వీడిని, మన బడిలో చదువవేయలేదమ్మా— వీడి బాలుణ్ణైయిన మన కోవకు తేవలె—అనగా,

మువ్వలు మ్రోగినటుల కిలకిలలాడి వారగా లోనికి పోయినారు:

తాతగా రందుకున్నారు:—చూశావూ, యీ కృష్ణాజీ ఉన్నదే—మన కామన్నగారి చేతి చలువను వెలసిన వంశంలో చిగురుకు మిగిలినది. పారంపర్యంగా, ఆనాటినుండీ యీ కులానికి రాచపొత్తే—యీమెను పొరుగు జమీందారులు చేపట్టారు. కాని వంశాభివృద్ధి కాలేదు—అని కించపడలేదు—యీ భవనము, ఏనాడో,కన్యా గురుకులమైనది: ఈ బాలలందరూ రంభాకులమువా రనుకునేవు—నేను పలుకరించిన చిన్నది బ్రాహ్మణుల ఆడుపడుచు: పేద కుటుంబములలో ఉన్న కన్యా రత్నములను వెదకి తెచ్చి విద్యాబుద్ధులు నేర్పి—చక్కని శిక్షణ యిస్తూ—జీవితం గడుపుతున్నది. ఈమె—

పూర్వం పాటలీపుత్రంలో యిలాటి విద్యా నికేతనము లుండేవట! అయినయింటికన్నెలు కూడ, అచ్చట ఒద్దికలు నేర్చుకునేవారట.


లలితకళలే, లోకమునకు రక్ష—అనీ,

కన్నె లందరూ, ఆట పాటలు నేర్చి, విద్దెలను దైవమున కంకితము చేసిననాడు—ఇంటింటా నిత్యకళ్యాణము కాదా అనీ, ఆమె అభిప్రాయము. మన అభిమతమూ అదే....

ఇంతలో ఆమె తిరిగి వచ్చినది: అందరమూ ఆలయమునకు వెళ్ళినాము:

గోపాలుని సన్నిధిలో వీణెలు లాలనగా తానములు మీటినవి: మువ్వలు మందెమేలములుగా కువకువ లాడినవి: అంతటా అలముకున్న అగరు జవాది ధూపము మైమరపు ఘటించినది: బాల గోపాలుని మోమున మల్లెలు విరిసినవి. చివురులు కదిలినట్లు, చిలుకరెక్క లాడినట్లు,—కొదమ తుమ్మెద ముసిరినట్లు,—తంబురనాదము, రవళించగా,—పండుతనము,, నిండుతనము వెల్లివిరియంగా—ఆ గానము నా చెక్కిలి పుణికినది—

గోరు వెచ్చని వెన్న లిందరా—
గోరుగోరు మీగడ లిందరా—
గుమ్మపా లిందరా .....
కమ్మని తాయిల్ల మిందరా—
యిందరా—
నందయగారి బుల్లి తువ్వాయీ—అందరా॥
అందెలు మువ్వలు సందిట దండలు
రవ్వల మొలనూ లిందరా—
పిల్లంగోరు చెన్నాకోలు
బన్నసరా లిందరా—
యిందరా—
గొల్లలవాడలో కొంటెకోణంగీ—అందరా॥
వెన్నెల నీడ—వేడుకమీర
సన్న జాజుల పానుపుమీద



ASP/TI-4 TEL

పావుర పలుకు పలికేరా—
కోరిన తీరున కులికేరా—
పచ్చకప్పురపు తమ్మల మిందరా—
యిందరా—
కొమ్ములవాడి కోడె నాగన్నా—అందరా!!

ఆ గానములో, మబ్బును మెరుపు కమ్మిన ట్లయినది—

గోపాలమూర్తి పారాడు పాపడైనాడు—
లాలనగాపిలిచేది—వాడలో గోపిక—
అవ్వాడు—పసిబాలు డైనాడు—
చేరదీసేది—యశోద.

వేణుగానలోలుడు వేడుకకాడైనాడు. సరసాలకు మంతన మాడేది — పొన్నమాను నీడను నిలిచిన ఒక జాణ—

కృష్ణాజీ మోమున, యిన్ని కళలు తిరిగినవి. ఇన్ని వన్నెలు యిన్ని మన్ననలు మెరసినవి—

కన్నా — నిన్ను చూచిన కన్నుల వెలది వెన్నెల కలకాలము నిలిచేను.

నిన్ను కొలిచిన చేతుల, చివురుల సును మెత్తందనమె అనుదినము— పసమీరేను.

నిను తలచినమనమే, నిను సేవించిన తనువే.— శాశ్వత యవ్వనమయ్యేను:

వెన్న దిన్నవాడా—నీ చక్కందనమే— కామనల కన్నెతనము.

నిన్ను కొలుచు వరము మాకు యిటులనే ప్రసాదించవే

మమ్మాదరించవే—మారుని కన్నవాడా—!

అని విన్నపాలు పలికినదై, కృష్ణాజీ సెలవిచ్చింది కదా— "నాయనా— అందము యీ నల్లవాని కన్నుల నున్నది: అలవిమాలిన ఆనందమ్ము వీని సన్నిధి నున్నది: నాకులాన కన్నెను దయ జూచినవాడు, రంభాకులమువారి విద్దెలకు వెలితనము బాపి ఐదువతనము అనుగ్రహించినవాడు. దైవానికి మించిన దైవం—మన కులముస్వామి—కామావధానులుగారు: వారి నిత్యదీవెన—వారి శాశ్వతప్రసాద రూప మీ గోపాలమూర్తి—మనసున చిరుమబ్బులు కమ్మిననాడు—తనువు, తనదేపెత్తనమన, దారికి వైదొలగించ యత్నించిననాడు—తాతగారి మనుమడా, దైవం మెచ్చే బాలుడా, ఈ గోపాలుడు నీ సంగడికాడై సరస నుండేనయ్యా—కోరిన ఆనంద మిచ్చేనయా—తీరని కోరిక తీర్చేనయా—అని దీవెనగా అన్నది: నా కనులు ఆ అవ్వకు మ్రొక్కినవి ....

తాతగారు నన్ను కౌగిట జేర్చినారు: వేయి జన్మలకు సరిపడిన చదువు చెప్పిన ఆ వేదమయునికి వీని మనము పూజాసుమమైనది...

★



# ఊహా మాలిక

కుమారి కె. లక్ష్మి

పారిజాతాల కమనీయ పరిమళమ్ము
మల్లె మొల్లల స్వచ్ఛతల్ మనసునింప,
పరుగులిడిపోయి ప్రసవాల ప్రోగుజేసి,
మాల లల్లితి బాల్యాన, గలలుగంటి.
నీలిజలదాల అలలపై దేలిపోయి,
మానసపథాన నూహాసుమాల నేరి,
కోరి యోచనా సూత్రాన గూర్చుకొంటి,
పరిమళమ్ములు నిండె నా భావవీథి.
మానసుపడి కూర్చుకున్న నందన సుమాలు
అర్థరహితమ్ములో నూహ లందురంచు,
ఒరుల కేరికి దెలుపక విరులసరము
దాచుకొన్నాను మనసులో దీప్తితోడ.
ప్రకృతిలో రేగె నెప్పుడో ప్రబలఝంఝ
జాలివీడి ప్రభంజనస్వామి రేగి
కంటికింపయిదోచు నా మింటిపూల
మాల నింతలో గిరికీల దూలజేసె.
మనసు గైసేసికొన్నట్టిమాలవాడ,
గుండె బరువెక్క జలములు కురిసె కనులు;
వ్యధిత హృదయాన భావాలు వాహించులు,
దేవదేవుని పాదాల దృష్టినిలిచె.

**కవితా కింకిణి**
బహుమతి పొందిన కవిత